పెదపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గ్రామంలో వ్యాధులు సోకిన వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి రాంబాబు చెప్పారు. పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా ఆ గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల ఇంటింటికి వెళ్లి వైద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 45 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం శీతకాలం కావడంతో చలి మంచు ఎక్కువగా వేస్తుందని దీంతో జలుబు, దగ్గు వంటి లక్షణాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్ స్వామి, కిరణ్ పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'మీ కోసం'కు 53 వినతులు

వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 63 అర్జీలు అందాయి. వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డి.ఆర్ఓ. కె.పద్మలత అర్జీలను స్వీకరించారు. తాగునీటి, భూ సమస్యలు, రహదారులు, ప్రధాన మంత్రి జన్ మన్ ఇళ్లు మంజూరు, గృహ నిర్మాణాల బిల్లులు చెల్లింపుల కోసం వినతులు అందాయి. పెదబయలు మండలం ఇంజరి గ్రామ పంచాయతీ జమధంగి, బంగారం కొండ గ్రామాలకు రోడ్లు నిర్మించాలని పంతాల జాన్ బాబు, పంతాల కోటేశ్వరరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ పంగళము, సంపంగిబంద గ్రామాలకు రోడ్లు నిర్మించాలని పి. జగదీష్, ఎస్. రమేష్ విసతి పత్రం సమర్పించారు. జి.కె. వీధి మండలం జి.కె. వీధి పంచాయతీ లంకపాకలు గ్రామస్థులు 15 కిలో మీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవలసి వస్తోందని గ్రామంలో మినీ డిపో ఏర్పాటు చేచేయాలని పలువురు వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం మినుములూరు పంచాయతీ గాలిపాడు, బొర్రగొంది, కాంగెడ్డ గ్రామస్తులు ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో ఇళ్ల బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం. హేమ లత, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం జోన్ ఛైర్మన్ దొన్ను దొర

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీలో రూ 11కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి,ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర శుక్రవారం శంకుస్థాపన చేశారు. పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంద న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గుమ్మా పంచాయతీలో 11 గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. గుమ్మ పంచాయతీ నుంచి చీడివలస వయా నిమ్మ ఊట, దిగుమల్లెలు, ఎగువ మల్లెలు, మిరతిగూడ, మద్దిపాడు, బురుగులపాడు, కరకవలస, పోర్లువలస, కరివేరుసు, మర్రివలస తదితర గ్రామాలకు ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ముందుకు నడుస్తుందన్నారు. ఈ గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ గిరిజన గ్రామం నుంచి డోలి మోతలు ఉండకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బుజ్జి బాబు, జనసేనా పార్టీ మండల అధ్యక్షుడు సిట్టం నాయక్ మురళి, గుమ్మ సర్పంచ్ సారా రాములమ్మ, గంగరాజు ,మాజీ ఎంపిటిసి సోమినాయుడు, మాజీ సర్పంచ్ వీరన్న దొర, జని చిట్టిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -అనంతగిరి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు బృందం పర్యటన నేపథ్యంలో అనంతగిరి మండల పర్యాటక ప్రాంతాల కార్యదర్శులు, బొర్రా గుహలు సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో ఏవివి కుమార్ పేర్కొన్నారు. బొర్రా గుహలు మేనేజర్, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న న్యాయమూర్తుల పర్యటన ఉన్నందున ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు పరిసర ప్రాంతాలు ఎక్కడ కూడా అపరిశుభ్రంగా లేకుండా చూడాలని తెలిపారు అరకు నుంచి రహదారి మార్గంలో న్యాయమూర్తులు అనంతగిరి మండల కాఫీ తోటలు మీదుగా పర్యటిస్తున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి లాలం సీతయ్య, పంచాయతీ కార్యదర్శి ధర్మ, సచివాల సిబ్బంది, బొర్రా గుహలు మేనేజర్ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

12న నవోదయ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకులోయ గవర్నమెంట్ హైస్కూల్లో ఈనెల 12న పి.ఆర్.టి.యు ఆధ్వర్యంలో నవోదయ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి గెన్ను, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మోడల్ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీ రహదారుల నిర్మాణానికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, మునిపెన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏజెన్సీ మారుమూల పల్లెలకు సైతం రహదారులు నిర్మించేలా కృషి చేయడం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మండలంలోని పలు రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమి పూజలు చేశారు. గోకులాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని వట్టిగెడ్డలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో జనుమూరి రమణమ్మ గోకులాల షెడ్డును ఎమ్మెల్యే శిరీషాదేవి విజయభాస్కర్ ప్రారంభించారు. మండలంలోని కిమ్మలిగెడ్డ నుంచి ముర్లవారి వీధి వరకు నూతన తారురోడ్డు, లోదొడ్డి నుండి కిండంగి రహదారి పనులకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమంతో పాటు పశువుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మండలంలో 30 గోశాలల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 26 మంజూరయ్యాయని, మిగిలిన నాలుగు త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జి.పెద్దిరాజు, కార్యదర్శి ఎం.డింబకేశ్వరరావు, సర్పంచ్‌లు పార్వతి, రమణి, ఎల్ రామారావు, టీడీపీ నాయకులు జి తాతారావు, బి అనుదీప్, సావిత్రి, తాహశీల్దార్ ఎ.సత్యనారాయణ, గిరిజన గిరిజన సంక్షేమ శాఖ డిఈ గౌతమి, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చినబాబు, పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుక ప్రజాశక్తి

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు శిరీషాదేవి, విజయ్ భాస్కర్ తదితరులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల గొంతుకును వినిపిస్తున్న పత్రిక ప్రజాశక్తి దినపత్రిక అని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు ఎం.విజయభాస్కర్ అన్నారు. ప్రజాశక్తి 2025 కేలండర్‌ను శు క్రవారం వారు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషాదేవి విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు, మండల సొసైటీ మాజీ అధ్యక్షులు గణజాల తాతారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బారంగి అనుదీప్, టిడిపి నాయకులు గంగాధర్, కె.వీరబాబు సిహెచ్.పండుబాబు, జె.మధు, కె.రత్నం, ప్రజాశక్తి పాత్రికేయులు పి.రామరాజు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో అంగన్వాడీ తల్లులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణలత, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు కె వెంకటలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజల ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు సిహెచ్ కుమారి, రమణి, సుందరమ్మ, రాజేశ్వరి, రత్నం, పార్వతి, రాధ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు, సిఐటియు నేతలు

ప్రారంభిస్తున్న పిఒ

గోల్డెన్ జూబ్లీ స్తూపం ప్రారంభం

ప్రజాశక్తి పాడేరు: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ స్థూపాన్ని పిఒ అభిషేక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీడీఏ ఆధ్వర్యంలో అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అన్నారు. ఐటిడిఏ కార్యాలయం ద్వారా గిరిజన అభివృద్ధికి 50 ఏళ్ల కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్‌రావు, ఎం. వెంకటేశ్వరరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ జి.డేవిడ్ రాజు, ఉపసంచాలకులు ఎల్.రజిని తదితరులు పాల్గొన్నారు.

చలితో గజగజ

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని గత పది రోజుల నుండి చలి తీవ్రత ఎక్కువైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి చలి మొదలై ఉదయం తెల్లవారు 9 గంటల సూర్య కిరణాలు తాకని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ఇల్ల నుండి బయటకి వెళ్ళని పరిస్థితి నెలకొంది. కొంతమంది గ్రామాల్లో గుంపుగా చలి మంటలు వేసుకుంటున్నారు. అనంతగిరి -అరకు మీదుగా వెళ్లే వాహనదారులు చలితో అవస్థలు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు స్వెట్టర్లు ధరిస్తున్నారు.

మంట కాగుతున్న గిరిజనులు

ఊటగెడ్డ నీరే గతి..

ఊట గెడ్డ నుండి నీరు సేకరిస్తున్న గిరిజనులు

- ★ తాగునీటి సౌకర్యం లేక అన్నవరం గ్రామస్తుల అవస్థలు
- ★ కలుషిత నీరు తాగి రోగాల బారిన గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ అన్నవరం గ్రామ గిరిజనులకు ఊట గెడ్డ నీరే దిక్కు. ఈ గ్రామంలో మంచినీటి సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తమ గ్రామానికి మంచినీరు సౌకర్యం కల్పించాలని మహాప్రభువు అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకొనే నాధులే లేరు. గత్యంతరం లేక గిరిజనులు కాలువల నుంచి వచ్చిన ఊట నీటినే సేకరించి తాగుతున్నారు. ఆ నీటినే వాడుకకు ఉపయోగిస్తున్నారు. నీటి సమస్య వల్ల ఆ ఊట గెడ్డలోనే బట్టలు ఉతకడం చేస్తున్నారు. దీంతో కలుషితమైన ఊట గెడ్డ నీటిని తాగడంతో అనేక రోగాల బారిన పడక తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో కనీస అవసరాలు తీర్చడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, టిడిపి కూటమి పార్టీల నాయకులు స్పందించి తమ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించి ఎటువంటి రోగాల బారిన పడకుండా కాపాడాలని వేడుకుంటున్నారు.

వారపు సంత కిటకిట

రద్దీగా ఉన్న దుకాణాలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు వారపు సంతలో శుక్రవారం సంక్రాంతి శోభ సంతరించుకుంది. పండగను పురస్కరించుకొని మండలంలోని గిరిజనులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దుకాణాలు కిటకిటలాడాయి. గిరిజనులకు నూతన వస్త్రాలతో పాటు వస్తువులు కొనుగోలు చేసుకోవాలంటే వారానికి ఒకసారి జరిగే వారపు సంతకు వస్తుంటారు. గిరిజనులు సంతకు అధిక సంఖ్యలో తరలి రావడం, పర్యాటక వాహనాల రద్దీతో అరకు సంత బయలు మెయిన్ రోడ్డు తోపాటు కొర్రాయి రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. గిరిజన సాంప్రదాయమైన షేర్ బుడియాల విచిత్ర వేషధారణలో గిరిజనులు దుకాణాల్లో చందాలు వసూలు చేశారు. డప్పు వాయిద్యాలతో సందడి చేశారు.

ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

నిలిచిన వాహనాలు

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని కాగిత గ్రామంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను శు క్రవారం కంపెనీ ప్రతినిధులు ఎస్.కుళ్లాయి రెడ్డి, ఎమ్.సుబ్బారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు కోట్లాది రూపాయలతో పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, వాటర్ ప్లాంట్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యా, వైద్యం, మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కాగిత గ్రామంలో 10 లక్షల నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి చింతల శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైర్లు

- అప్పుడప్పుడూ షార్ట్ సర్క్యూట్
- భయాందోళన చెందుతున్న శాండికోరి గ్రామస్తులు

పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి శాండికోరి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న వైర్లు తెగి షార్ట్ సర్క్యూట్ జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు జాయింట్ ఊడిపోవడంతో అప్పుడప్పుడు షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని గ్రామానికి చెందిన బత్తుల మార్టిన్ తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ప్రతిరోజు చిన్న పిల్లలు తిరుగుతుంటారని, మూగజీవాలు సంచరిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రతిరోజు వీధిలైట్లు స్విచ్ ఆన్‌చేసి ఆపు చేసే డిపి స్విచ్ మరమ్మతులకు గురి కావడంతో నెల రోజుల నుంచి విద్యుత్ దీపాలు పగల రాత్రి వెలిగే ఉంటున్నాయి. దీనిపై అనేకసార్లు లైన్‌మెన్‌కు గ్రామస్తులు సమాచారం అందించిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని మార్టిన్ తెలిపారు. ఇప్పటికైనా ఎపి ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నూతన విద్యుత్ వైర్లు అమర్చాలని, కొత్త డిపి స్విచ్ ఏర్పాటు చేసి వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని జీడిగుప్ప ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో శు క్రవారం మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విఆర్.పురం నుండి పోచవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న కొల్లూరుకు చెందిన ఇద్దరు యువకులు పాపికొండల విహార యాత్రకు వచ్చిన గుర్తు తెలియని కారు జీడిగుప్ప ప్రధాన ఆర్ అండ్ బి రహదారి వద్ద ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని అటు వైపు వెళుతున్న కొందరు గమనించారు. వారిని హుటాహుటిన అక్కడి నుండి ఆటోలో రేఖపల్లి పిహెచ్‌సికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు.

గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని 12న మూసివేత

ప్రజాశక్తి- అరకులోయ:ఈనెల 12వ తేదీన పరిపాలన పరమైన కారణాలతో గిరిజన మ్యూజియం, పెద లబుడు గిరి గ్రామదర్శిని పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని నిర్వహణ కారణాలతో పర్యాటకులకు ప్రవేశం రద్దు చేయాలని మ్యూజియం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 13వ తేదీన తిరిగి పున: ప్రారంభిస్తామని తెలిపారు. మ్యూజియం అధికారులకు, గిరి గ్రామదర్శిని అధికారులకు పర్యాటకులు సహకరించాలని కోరారు. మ్యూజియం, గిరి గ్రామదర్శిని ప్రవేశం రద్దును పర్యాటకులు గమనించాలని కోరారు.

13 నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండల కేంద్రంలోని ఆదివాసి మహిళా సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13 14 15, తేదీల్లో ముగ్గులు, థింసా, కూర్చి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆటలు పోటీలో పాల్గొవాలని కోరారు. ఈ పోటీలో విజేతలకు మొదటి, రెండవ, మూడో, బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ దిగువ పేర్కొన్న నెంబర్లకు 7569390747 సంప్రదించాలని ఆదివాసి మహిళా సంఘం గిరిజన సంఘం జిల్లా నాయకురాలు ఎస్ హైమావతి, టి.కృష్ణారావు కోరారు.

గీతం ఎంబిఎ విద్యార్థులకు సమ్మర్ ట్రైనీ అవార్డులు

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ ఆధారంగా ప్రకటన

సమ్మర్ ట్రైనీ అవార్డులు పొందిన గీతం వర్సిటీ ఎంబిఎ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: ప్రముఖ మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఇ4 డెవలప్‌మెంట్ జాతీయ స్థాయిలో ఎంబిఎ విద్యార్థులకు నిర్వహించిన అంతం కళాశాలల సమ్మర్ ప్రాజెక్టు పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన ఐదుగురు ఎంబిఎ విద్యార్థులు ఉత్తమ ప్రాజెక్టు నివేదికకు గాను సమ్మర్‌ట్రైనీ అవార్డులను సాధించారు. గత ఏడాది వేసవిలో ఫైనలియర్ ఎంబిఎ విద్యార్థులు నిర్వహించే ప్రాజెక్టులపై జాతీయ స్థాయిలో ఇ4 డెవలప్‌మెంట్ సంస్థ ఈ పోటీలను నిర్వహించింది. ఆన్‌లైన్ విధానంలో జరిగిన పోటీల్లో దేశంలోని 60 నగరాలలోని 250 బిజినెస్ స్కూల్స్‌కు చెందిన 13 వేల మంది విద్యార్థులు పోటీ పడ్డారు. విద్యార్థుల ప్రాజెక్టుకు గల ప్రాధాన్యత, వ్యక్తిగత ఇంటర్వ్యూలో కనబరిచిన ప్రతిభ, మేనేజ్‌మెంట్ అంశాలపై విశ్లేషనాత్మక పరిణతి, విద్యార్థులకు మెంటార్‌గా వ్యవహరించే అధ్యాపకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డులను శుక్రవారం ప్రకటించారు. గీతం ఎంబిఎ విద్యార్థులు చెరుకూరి సితార, జి.వి.విజయరత్న ప్రవల్లిక, పి.అంకిత, ఎస్.జ్యోత్స్న, అలీఘలీ దేశంలోని 100 మంది నైపుణ్యం గల ఎంబిఎ విద్యార్థుల జాబితాలో ఎంబిఎ సమ్మర్ ట్రైనీ అవార్డుకు ఎంపికయ్యారని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు వెల్లడించారు. గీతంలోని యుజి, పిజి కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని, హర్వర్డ్ కేస్ స్టడి సిలబస్‌లో భాగంగా చేశామన్నారు. విద్యార్థుల ప్రతిభను, వారికి మెంటార్‌గా వెనక ఉండి మార్గదర్శకం వహించిన అధ్యాపకులను అభినందించారు. జాతీయ స్థాయి గుర్తింపు ద్వారా ప్రముఖ కార్పొరేట్ సంస్థలలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న జియ్యాని

ప్రజాశక్తి- వేపగుంట : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు శుక్రవారం తెల్లవారుజామున విఐపి ప్రోటోకాల్ దర్శన సమయంలో శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

హుకుంపేట, చింతపల్లిలో నిర్వహిస్తున్న వేడుకలు

ప్రజాశక్తి-హుకుంపేట: -మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి వేడుకలు శుక్రవారం స్థానిక వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాష మాట్లాడుతూ, నిత్యం రోగులకు వైద్య సేవలు అందించే వైద్యసిబ్బందికి సంబరాలతో మానసిక ఉల్లాసాన్ని, సంతోషాన్ని ఇస్తాయమన్నారు. వైద్య సిబ్బంది ముగ్గులు వేసి, భోగిమంటలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

చింతపల్లి : చింతపల్లి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేశారు. విద్యార్థులు రంగురంగుల ముగ్గులతో కళాశాలను అలంకరణ చేశారు. వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాత్రుడు. రమణ, జగదీష్ బాబు, లైబ్రేరియన్ జగత్ రాయ్ నాగేంద్రబాబు, శివరాం కుమార్ పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్‌పై 'గీతం'లో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ: విశాఖలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇఇసిఇ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటీ ఆల్గారిథమ్స్‌పై ఐదు రోజుల శిక్షణ ముగిసింది.

గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యలో అన్ని కోర్సులలోనూ మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ అంశాలను బోధిస్తున్న అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా ఈ అంశాలపై లోతైన పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఐఐటి గౌహతి ఇఇఇ విభాగం ప్రొఫెసర్ హనుమంత్ సింగ్ షెకావత్. మెషిన్ లెర్నింగ్‌లో గణితశాస్త్ర ప్రాధాన్యతను వివరించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు ఎన్ఐటి వరంగల్ ఇసిఇ విభాగం ప్రొఫెసర్ జె.రవికుమార్ జెట్‌సన్ నానో, అడినోనానో పరిజ్ఞానంపై అవగాహన కలిగించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ కె.నాగేంద్రప్రసాద్ సాంకేతిక ప్రగతి, నూతన ఆవిష్కరణలపై అధ్యాపకులు దృష్టి ఉంచాలని, పరిశోధనల ద్వారా

అతిథులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రగతిలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్‌లు డాక్టర్ జి.అనిత, డాక్టర్ కె.రేణు, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18న 'మిలీనియం సాఫ్ట్‌వేర్' క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : మిలీనియం సాఫ్‌వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా కొత్త తరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఎల్లప్పుడూ ఆహ్వానం పలుకుతోందన్నారు. దేశంలో టెక్, నాన్-టెక్ రంగాల్లో వేగంగా డిజిటలైజేషన్ పెరగడంతో డిమాండ్‌కు అనుగుణంగా ఏడాదికి దాదాపు పది లక్షల మంది వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అవసరం అవుతున్నారన్నారు. విద్యార్థులకు అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పాత్రలో సుమారు 50 ప్లేస్‌మెంట్‌లను రూపొందించడానికి మెసర్స భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం ఐటి సెజ్‌తో కలిసి ఈనెల18న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

గడచిన 25ఏళ్లుగా మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ జాబ్ మేళాలు, క్యాంపస్ డ్రైవ్‌లను నిర్వహించి, ఇప్పటి వరకు ఐదు లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లను విజయవంతంగా కల్పించిందన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి 60శాతం మొత్తంతో బిటెక్ సిఎస్ఇ విద్యార్థులు, సి పైథాన్, నెట్, ఫ్రేమ్‌వర్క్, హెచ్‌టిఎంఎల్, సిఎస్ఎస్, జావా స్క్రిప్ట్‌లో మంచి నైపుణ్యం ఉన్న కంప్యూటర్ సైన్స్, ఇతర గ్రాడ్యుయేట్లు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ హెచ్‌ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి తెలిపారు. మెసర్స్ భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నంలో ఐటి, బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 18న ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ క్యాంపస్‌కి నేరుగా వచ్చి, లేదా hr@millennium-softsol.comకు రెజ్యూమ్‌లను పంపవచ్చనితెలిపారు. ఈ డ్రైవ్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, గరిష్టంగా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు www.millenniumsoftsol.com వెబ్‌సైట్‌ను లేదా 9248753098 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ సాగర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

398 కిలోల గంజాయి స్వాధీనం

పట్టుబడ్డ నిందితులు

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలోని సీకరి పంచాయితీ పన్నెడ జంక్షన్ వద్ద పోలీస్‌లు 398కిలోల గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమణ ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది జీపు, బైక్‌లను తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తులు సుమారు 398 కేజీల గంజాయి తో పట్టుబడ్డారు. పట్టు బడిన గంజాయి విలువ సుమారుగా 19 లక్షలు 9 వేలు ఉంటుందని తెలిపారు. నిందితులను సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందని ఎస్ఐ రమణ తెలిపారు

అరుకు సంతలో చోరీ

- రూ.19.76 లక్షలు అపహరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో అరుకు సంతలో శుక్రవారం దొంగలు భీభత్సాన్ని సృష్టించారు. వ్యాపారులను బెదిరించి నగదును దొంగలు అపహరించిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై పాపినాయుడు తెలిపిన వివరాలు... విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలానికి చెందిన కాపుగంటి రామచంద్రరావు అనే వ్యాపారుడు తన సహచరులతో కలిసి కాఫీ పంట కొనుగోలుకు ఉదయం ఆరు గంటలకు అద్దెకు తీసుకున్న గోడౌన్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకెళ్లి రెండు బ్యాగులను లాక్కొని పారిపోయారని చెప్పారు. బ్యాగుల్లో రూ.19.76 లక్షలను దొంగలు అపహరించుకు పోయారని అన్నారు. బాధిత వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి జిల్లా ఎస్పీ ఉత్తర్వులతో మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆర్‌టిసి బస్‌లో ఎమ్మెల్యే ప్రయాణం

బస్‌లో వెళుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం పాడేరు నుంచి విశాఖపట్నంకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. పాడేరు ఆర్టీసీ సేవలపై ఆయన ప్రయాణికుల నుంచి ఆరా తీశారు. పాడేరు నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు, వచ్చే ప్రయాణికులతో ఆయన మాట్లాడారు వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు.కూటమి ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ ప్రయాణం పై ఇచ్చిన హామీపై మహిళల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ లో ప్రయాణికులకు అరకొరగా సౌకర్యాలు ఉన్నాయని అన్నారు.

మాట్లాడుతున్న బొత్స

తొక్కిసలాటపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

- శాసన మండలి విపక్ష నేత బొత్స డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తిరుపతి తొక్కిసలాట ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వరుస ఘటనలతో తిరుమల ప్రతిష్టపై భక్తుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, దాన్ని కాపాడాలని న్యాయమూర్తిని కోరారు. టిటిడి ఛైర్మన్, ఇఒల మధ్య సమన్వయ లోపంతోనే ఘటన జరిగిందని పత్రికలు, డిప్యూటీ సిఎం చెబుతున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో సిఎం చంద్రబాబు ఎందుకంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పినంత మాత్రాన పోయిన భక్తుల ప్రాణాలు తిరిగి రావని, ఆయన ప్రాయశ్చిత్త దీక్ష ఎప్పుడు చేస్తారో చెప్పాలని అన్నారు. ఘటన అనంతరం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్టు కాదన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

- మాజీ ఎమ్మెల్యే చింతలపూడితో సహా 29 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని గండిగుండం -రామవరం రోడ్డులో శుక్రవారం కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య సహా 29 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఎసిపి ఎస్.అప్పలరాజు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట, కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేశారు. 29 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.07 లక్షల నగదు, 8 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మొదటి నిందితునిగా వల్లభనేని వంశీకృష్ణ ఉండగా, మిగిలిన నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య పేరును 28 నెంబరులో చేర్చారు. స్థానిక సిఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ గంట్యాడ సంతోష్ దాడుల్లో పాల్గొన్నారు కోడి పందేలలో పట్టుబడ్డ వారిలో పలువురు ముఖ్య నేతలతోపాటు మాజీ ఎమ్మెల్యే కూడా ఉండడంతో శుక్రవారం అనందపురం పోలీస్ స్టేషన్ రాజకీయ నాయకులతో నిండిపోయింది.

శభాష్ నితీష్

ప్రజాశక్తి - మధురవాడ : మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో ఉత్తమ ఆటతీరు కనబరిచి అందరి దృష్టినీ ఆకర్షించిన విశాఖపట్నానికి చెందిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వైజాగ్‌కు వచ్చిన నితీశ్ కుమార్‌రెడ్డి విశాఖలోని వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్-ఇండియా టి20 మ్యాచ్ సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా నితీష్ సెలెక్ట్ అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన ఆట తీరుతో, ఉత్తమ ప్రతిభతో విజయాలు నమోదు చేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలని, ఆ దిశగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు, తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎసిఎ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామ ప్రశాంత్, కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణు తేజ్, ఎసిఎ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్.కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వర్కర్లు ఏడాది క్రితం నిర్వహించిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలంటూ జివిఎంసి పరిధిలోని విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో కార్మికులు శుక్రవారం ఆందోళనలకు దిగారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ వర్కర్ల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద .జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దీక్షలో కూర్చున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023- 24 సంవత్సరాల మధ్య రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 17 రోజుల సమ్మె చేసిన క్రమంలో ప్రభుత్వం తమ యూనియన్‌తో ఒప్పందం చేసుకుందన్నారు. ఆ ప్రకారం అమలు చేయవలసిన డిమాండ్లను నేటి వరకు అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, 10 సంవత్సరాల సర్వీస్ వారికి ఇచ్చే రూ.లక్ష, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, దహన సంస్కారాలకు ఇచ్చే మట్టి ఖర్చుల మొత్తం రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపుదల, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, జీతాలపెంపు, సంక్షేమ పథకాల అమలు, తదితర ఒప్పంద హామీలను అమలు చేస్తూ వెంటనే జిఒలు జారీ చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిందని, గత ఒప్పంద విషయాలపై జిఒల జారీకి సిఎంను, మున్సిపల్ శాఖ మంత్రిని, ఉన్నతాధికారులను పలు పర్యాయాలు కలిసి విన్నవించినా స్పందన లేదని అన్నారు. దీక్షల అనంతరం జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణం జిఒలను విడుదల చేయకుంటే సంక్రాంతి అనంతరం సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముద్దాడ వరప్రసాద్, గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, వెంకటరావు, గణేష్, రాజు, సత్యవతి, ఒమ్మి అప్పారావు, రమణ, శేషు బాబు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి : గత సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు వెంటనే జారీ చేయాలని కోరుతూ జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు 4 సంవత్సరాల నుండి రావాల్సిన సరెండర్, ప్రమోషన్ స్కేల్, ఇంక్రిమెంట్లు, కార్మికులకు హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి ఏసురాజు, గోవిందు, ఓంశివ, రెల్లి సత్య నారాయణ, యర్రంశెట్టి శివకుమార్, అజయ్, నూకరాజు, ప్రసాద్, భారతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మురికివాడలో మౌలిక సమస్యలు పరిష్కరిస్తాం

మురికివాడలో పర్యటిస్తున్న సంపత్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 42వ వార్డు పరిధిలో ఉన్న ఇందిరా గాంధీ కాలనీ మురికివాడను శుక్రవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతితో కలిసి పరిశీలించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడ నివసిస్తున్న వారి నుంచి స్వయంగా తెలుసుకొని కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా కాలనీలో నివాసముంటున్న 76 ఇళ్ల కుటుంబాల వారితో మాట్లాడారు. తవిటమ్మ అనే వృద్ధురాలు అక్కడే నివాసితురాలుగా 50 సంవత్సరాలుగా కుటుంబంతో నివసిస్తున్నామని, ఈ ప్రాంతంలో ఉన్న అందరికీ ఇళ్ల పట్టాలు అందించాలని, వీధి లైట్లు వెలగక, మౌలిక సదుపాయాలు లేక నివాసితులంతా ఇబ్బంది పడుతున్నామని వివరిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. సుమారు 20 ఇళ్లకు వర్షాలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కరెంటు సదుపాయాన్ని ఇపిడిసిఎల్ కల్పించలేనందున చీకట్లోనే నివసిస్తున్నామని కొంతమంది నివాసితులు కమిషనర్‌కు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఇందిరా గాంధీ కాలనీ మురికివాడలో 76 కుటుంబాలు నగరంలో కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నాయని, వారికి జివిఎంసి నుంచి ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం మురికివాడ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ వీధిలైట్లను వెంటనే వెలిగేలా, అలాగే అవసరమగు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్లు తారా ప్రసన్న, మురళీకృష్ణలకు, అలాగే ఆ ప్రాంతం పూర్తి వివరాలను, నివాసితుల వివరాలను వెంటనే సమర్పించాలని ఎసిపి శాస్త్రికి, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్‌లకు కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ బి.రాము, సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో సాగుతున్న పూజా కార్యక్రమాలు

వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

ప్రజాశక్తి-విఆర్.పురం : రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ దంపతులు, విఆర్ పురం ఎస్సై.సంతోష్ కుమార్, కూనవరం ఎస్ఐ లతాశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర, మండల ప్రజలు, రైతులు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కమ్మిచిచ్చు సత్యనారాయణ, గుండెపూడి లక్ష్మణరావు, ఆత్మకూరు కాంతారావు, నాల్లారపు చంద్రావు, దారోగి బాబురావు, ఆలయ చైర్మన్ సుదర్శన్, మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు వెంకటేశ్వర స్వామి, రామాలయాల్లో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలనికి వున్న ప్రధాన ద్వారాలను మూసివేసి ఉత్తర ద్వారం తెరసి భక్తులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. రామాలయం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు స్థానిక మహిళా కళాకారులచే కోలాటం భజన కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న బాలికల కోలాటం

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం జడ్డంగి బాలికలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా జడ్డంగి శ్రీవెంకటేశ్వరస్వామిని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవిజయ దుర్గ భజన కోలాట బృందం ప్రదర్శించిన నృత్యాలను తిలకించారు. కోలాటం ప్రదర్శించిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నృత్య శిక్షణ ఉపాధ్యాయురాలు యు.లక్ష్మి, బృంద సభ్యులు యు.శ్రీదేవి, జి.రాజేశ్వరి, జి.వరహాలమ్మ, యు.త్రివేణి, కళామణి, ఆలయ కమిటీ సభ్యులు గణజాల తాతారావు, గంగాధర్, గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ఎం.డింబకేశ్వరరావు, సావిత్రి, కూటమి పార్టీల నాయకులు అనుదీప్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో..

యూట్యూబర్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా ప్రాచుర్యం పొందిన ఫన్ బకెట్ భార్గవ్ 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో అతనికి 20 సంవత్సరాల జైలు శిక్షకు విధించింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అమానుష చర్యల కారణంగా బాలిక గర్భం దాల్చింది. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదు చేసిన కేసు ఆధారంగా విశాఖ నగర మహిళా పోలీస్ స్టేషన్ ఎసిపి డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో ఈ కేసులో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. ఛార్జ్‌షీట్‌ను సమర్థంగా కోర్టులో సమర్పించి, సాక్ష్యాలను అందించారు. సదరు సాక్ష్యాల ఆధారంగా విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు బాధిత బాలికకు నష్ట పరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది.